క్లుప్తంగా

చలివేంద్రం ప్రారంభం



దుగ్గొండి : మండలంలోని ముద్దునూరు గ్రామంలో స్థానిక శివ రామాంజనేయస్వామి దేవాలయ కమిటీ ఆధ్వర్యంలో చలివేంద్రం ఏర్పాటు చేయగా ఎస్సై నవీన్‌కుమార్ సోమవారం ప్రారంభించారు. ప్రజలు, బాటసారుల దాహార్తి తీర్చడానికి చలివేంద్రాలు ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ రేవూరి సురేందర్‌రెడ్డి, ఎంపీటీసీ కొంగర అరుణరవి, ఆలయ కమిటి చైర్మన్ కరుణాకర్ పాల్గొన్నారు.

'బిల్లులు ఇప్పించండి'

ఖానాపురం : మండలంలోని బుధరావుపేట ప్రాథమిక, ఉన్నత పాఠశాలలో మన ఊరు -మన బడిలో భాగంగా అభివృద్ధి పనులు చేసామని, బిల్లులు రాక నానా ఇబ్బందులు పడుతున్నామని సర్పంచ్ ప్రవీణ్‌కుమార్ ఆవేదన వ్యక్తం చేశారు. ఈ మేరకు సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. పాఠశాలలో రూ.29.30లక్షలతో నిర్మాణ పనులు చేసుకోని ప్రారంభోత్సవం కూడా పూర్తి అయిందన్నారు. బిల్లుల కోసం అధికారులను ప్రశ్నిస్తే దాటవేస్తూ వస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. సకాలంలో డబ్బులు రాకపోవడంతో తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్నాయని తెలిపారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి తక్షణమే బిల్లులు మంజూరు చేయించే విధంగా చర్యలు చేపట్టాలని కోరారు.

మట్టి ట్రాక్టర్‌కు జరిమానా

ఖానాపురం : అక్రమంగా మట్టి తరలిస్తున్న ట్రాక్టర్‌కు జరిమానా విధించినట్లు తహసీల్దార్ జూలూరి సుభాషిణి తెలిపారు. మండలంలోని అశోక్‌నగర్ శివారు సైనిక్‌స్కూల్ వద్ద ఆదివారం ఎస్సై తిరుపతి అక్రమంగా మట్టితరలిస్తున్న ట్రాక్టర్‌ను పట్టుకున్న విషయం విదితమే. దీంతో పోలీసులు, రెవెన్యూ అధికారులకు అప్పగించడంతో రూ.2వేల జరిమానా విధించి వదిలేసినట్లు తెలిపారు. అనుమతులు లేకుండా తవ్వకాలు చేపడితే కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు.

వినతి

నర్సంపేట : నల్లబెల్లి మండలంలోని కన్నారావుపేట శివారులో ఏర్పాటు చేయనున్న ఉప కాల్వ నిర్మాణాన్ని రద్దు చేయాలని రైతులు ప్రతాప్‌రెడ్డి, దేవేందర్ కోరారు. ఈ మేరకు ఆర్డీఓ కార్యాలయ అధికారులకు సోమవారం రైతులు వినతిపత్రం అందజేశారు.

ప్రత్యేక పూజలు

వరంగల్ (పర్వతగిరి) : మండల కేంద్రంలోని రుక్మిణిసత్యభామ సమేత వేణుగోపాలస్వామి యూత్ ఆధ్వర్యంలో సీతారాముల నాగవెల్లి మహోత్సవాన్ని సోమవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు.

'బీజేపీ విజయం ఖాయం'

చెన్నారావుపేట : వచ్చే ఎన్నికల్లో బీజేపీ విజయం సాధిస్తుందని జిల్లా నాయకుడు నూకల కృష్ణయాదవ్ అన్నారు. నర్సంపేట నియోజకవర్గంలోని ప్రజలు మార్పు కోసం ఎదురు చూస్తున్నారని కృష్ణయాదవ్ తెలిపారు. ఈ మేరకు మండల కేంద్రంలో సోమవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. బీఆర్ఎస్, కాంగ్రెస్ నాయకులు పోటాపోటీగా తామే అభివృద్ధి చేశామని ఉపన్యాసాలు ఇస్తూ హడావిడి చేస్తున్నారని విమర్శించారు. ఆత్మీయ సమ్మేళనంతో ప్రజలను బురిడి కొట్టిస్తున్నారని ఆరోపించారు. సమావేశంలో నాయకులు అనిల్ నాయక్, తాళ్లపెల్లి రమేష్, హంస రామకృష్ణ ఉన్నారు. అలాగే జల్లీ గ్రామంలో జీపీ కార్మికులకు మదన్‌మోహన్‌రావు సహకారంతో దుస్తులు అందించారు.

నేడు పట్టణ కమిటీ ఎన్నిక

నర్సంపేట : కాంగ్రెస్(ఐ) పట్టణ కమిటీని నేడు (మంగళవారం) ఎన్నుకోనున్నట్లు నర్సంపేట మున్సిపల్ ఫ్లోర్ లీడర్ వేముల సాంబయ్య ప్రకటనలో తెలిపారు. స్థానిక పార్టీ కార్యాలయంలో ఉదయం 11గంటలకు కమిటీని మాజీ ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి ఆదేశానుసారంగా ఎన్నుకుంటారని తెలిపారు. నాయకులు, కార్యకర్తలు సకాలంలో కార్యాలయానికి హాజరుకావాలని పిలుపునిచ్చారు.

భాగస్వాములు కావాలి



రాయపర్తి : గ్రామంలోని రామాలయంలో ధ్వజస్తంభ ఏర్పాటునకు ప్రతీ ఇల్లు భాగస్వాములు కావాలని జెడ్పీటీసీ రంగు కుమార్‌గౌడ్, సర్పంచ్ లేతాకుల సుమతియాదవరెడ్డి కోరారు. సోమవారం మండలంలోని మైలారం గ్రామంలో రామాలయంలో ధ్వజస్తంభం ఏర్పాటుకోసం అడహక్ కమిటీ సమావేశంను నిర్వహించి దాతల ద్వారా విరాళాల సేకరణ నిర్వహించారు. కార్యక్రమంలో నిర్వహణ కమిటీ, గ్రామస్తులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ధ్వజస్తంభం ఏర్పాటుకోసం 950 కుటుంబాలకు చెందిన గ్రామస్తులు ముందుకొచ్చినట్లు తెలిపారు. నాయకులు, దాతలు విరాళాలు ప్రకటించినట్లు చెప్పారు.

నెక్కొండ: పరీక్ష రాసేందుకు వస్తున్న విద్యార్థులు



ఖానాపురంలో..



రాయపర్తి: గురుకుల పాఠశాల వద్ద..



వర్ధన్నపేట : పరీక్ష కేంద్రం వద్ద విద్యార్థులు





ఖానాపురంలో..

'టెన్త్' పరీక్షలు ప్రారంభం

జిల్లావ్యాప్తంగా పదో తరగతి పరీక్షలు సోమవారం నుంచి ప్రారంభమయ్యాయి. ప్రభుత్వ ఉన్నత పాఠశాలలతోపాటు తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలలు, కస్తూర్బాగాంధీ విద్యాలయాలు, మోడల్ స్కూల్స్, ప్రైవేట్ పాఠశాలలకు చెందిన పదోతరగతి విద్యార్థులు మొదటి రోజు పరీక్షను ప్రశాంతంగా రాశారు. కొన్నిచోట్ల విద్యార్థులు గైర్హాజర్ అయ్యారు. పరీక్ష కేంద్రాల వద్ద అధికారులు, ఉపాధ్యాయులు క్షుణ్ణంగా తనిఖీ చేసి లోపలికి పంపారు. ఆయా మండలాల్లో ఫ్లయింగ్ స్క్వాడ్ అధికారులు పరీక్ష కేంద్రాలను తనిఖీ చేశారు.

– సాక్షి నెట్‌వర్క్



రాయపర్తి: తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలలో పరీక్షకు హాజరైన విద్యార్థులు



సంగెం: పరీక్ష రాయడానికి ఆలస్యమవడంతో పరిగెడుతున్న విద్యార్థులు



దుగ్గొండి: మల్లంపల్లిలో తనిఖీ చేస్తున్న ఎస్సై



నల్లబెల్లి: పరీక్ష కేంద్రంలో వైద్య సేవలు..



చెన్నారావుపేట: తనిఖీ చేస్తున్న ఉపాధ్యాయులు



సంగెం: విద్యార్థులను తనిఖీ చేస్తున్న అధికారులు

కఠినంగా శిక్షించాలి



సమావేశంలో మాట్లాడుతున్న బొట్ల నరేష్

నర్సంపేట రూరల్ : పదో తరగతి ప్రశ్నాపత్రం లీకేజీ చేసిన వారిని కఠినంగా శిక్షించాలి ఏబీఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి బొట్ల నరేష్ అన్నారు. నర్సంపేటలో ఏబీఎస్ఎఫ్ నాయకుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర విద్యాశాఖ మంత్రి సబితా ఇందిరారెడ్డి సొంత జిల్లా అయిన వికరాబాద్‌లోని తాండూర్‌లో పదో తరగతి పరీక్ష జరుగుతున్న తరుణంలో ప్రశ్నా పత్రం ఇచ్చిన ఐదు నిమిషాలకే పేపర్ లీకేజీ కావడం దారుణమన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు ప్రశాంత్, వినయ్, శ్రీకాంత్, రమ్య, ప్రవళిక, రాజు, రవీందర్, ప్రవీణ్‌తో పాటు తదితరులు పాల్గొన్నారు.

నిధులు విడుదల

నర్సంపేట : బంజారా భవన్ నిర్మాణానికి తెలంగాణ ప్రభుత్వం రూ.2 కోట్ల నిధులను మంజూరు చేసిందని నర్సంపేట ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి సోమవారం తెలిపారు. నర్సంపేటలో బంజారా భవన్ నిర్మాణానికి జీఓ నం 153 ద్వారా నిధులను విడుదల చేసిందన్నారు. ట్రైబల్ వెల్ఫేర్ శాఖ ద్వారా తన ప్రత్యేక వినతిలో భాగంగా నిధులు విడుదల చేసినట్లు తెలిపారు. బంజార భవన్ నిధుల విడుదలకు సహకరించిన ముఖ్యమంత్రి కేసీఆర్, గిరిజన శాఖ మంత్రి సత్యవతిరాథోడ్‌కు కృతజ్ఞతలు తెలిపారు.

అభివృద్ధి, సంక్షేమం కాంగ్రెస్‌తోనే సాధ్యం

ఏఐసీసీ సభ్యుడు దొంతి మాధవరెడ్డి



యాత్ర నిర్వహిస్తున్న దొంతి మాధవరెడ్డి

దుగ్గొండి : రాష్ట్రాభివృద్ధి, ప్రజా సంక్షేమం కాంగ్రెస్ పార్టీతోనే సాధ్యమని ఏఐసీసీ సభ్యుడు దొంతి మాధవరెడ్డి అన్నారు. మండలంలోని చలపర్తి, జీడికల్, రేకంపల్లి గ్రామాలలో సోమవారం రాత్రి హాథ్ సే హాథ్ జోడోయాత్రలో భాగంగా ఆయన పాదయాత్ర నిర్వహించారు. ఈమేరకు చలపర్తిలో మహిళలు మంగళహారతులతో స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఆయా గ్రామాల కూడళ్లలో ప్రజలను ఉద్దేశించి మాధవరెడ్డి మాట్లాడారు.దేశవ్యాప్తంగా నిరుపేదలకు సంక్షేమ ఫలాలు అందించిన ఘనత కాంగ్రెస్‌కే దక్కిందన్నారు. కేంద్ర, రాష్ట్రాలలో జరుగుతున్న అరాచక పాలనకు చరమగీతం పాడటానికి ప్రజలు సిద్ధం అవుతున్నారన్నారు. దేశంలో నేడు సంపదనంతా బీజేపీ పాలకులు అదాని, అంబానీలకు దోచిపెడుతున్నారన్నారు. ప్రతి కార్యకర్త దేశంలో, రాష్ట్రంలో జరుగుతున్న పరిణామాలను ఇంటింటికి వివరించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు తోకల శ్రీనివాసరెడ్డి, పాలాయి శ్రీనివాస్,పార్టీ మండఅధ్యక్షుడు ఎర్రల్ల బాబు, చెన్నూరి కిరణ్‌రెడ్డి, ఒలిగె నర్సింగరావు, గ్రామాల పార్టీ అధ్యక్షులు నల్ల యాదవరెడ్డి, మాదారపు కన్నయ్య పాల్గొన్నారు.

మజ్జిగ ప్యాకెట్ల పంపిణీ

రాయపర్తి : మండలకేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో లయన్స్‌క్లబ్ ఆఫ్ వర్ధన్నపేట ఆధ్వర్యంలో సోమవారం పదోతరగతి విద్యార్థులకు మజ్జిగ ప్యాకెట్లను పంపిణీ చేశారు. మజ్జిగను అందించడం అభినందనీయమని ఎస్సై బండారి రాజు పేర్కొన్నారు.కార్యక్రమంలో ఆకుల సురేందర్ రావు, బిల్లా సుభాష్‌రెడ్డి, కొమురవెల్లి లింగమూర్తి తదితరులు పాల్గొన్నారు.

ఉచిత రవాణా సౌకర్యం ఏర్పాటు

దుగ్గొండి : పదోతరగతి పరీక్షల దృష్ట్యా ప్రభుత్వ పాఠశాలలోని విద్యార్థులను పరీక్షా కేంద్రాలకు ఉచితంగా తరలించడానికి పలువురు ప్రజా ప్రతినిధులు ముందుకు వచ్చారు. తిమ్మంపేట ఉన్నత పాఠశాల విద్యార్థులను సర్పంచ్ మోడెం విద్యాసాగర్, నాచినపల్లి ఉన్నత పాఠశాల విద్యార్థులను ఎంపీటీసీ నాగరబోయిన మమతామోహన్ 11రోజుల పాటు ఉచితంగా(ఆటో) రవాణా సౌకర్యం కల్పించారు. ఈ సందర్భంగా విద్యార్థుల తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు వారికి కృతజ్ఞతలు తెలిపారు.

శంకుస్థాపన

వరంగల్(పర్వతగిరి) : గ్రామీణ ప్రాంతాల్లో మైనార్టీలకు మసీద్, ఈద్గాల నిర్మాణాలు చేపట్టడం సంతోషకరమని జిల్లా కోఆప్షన్ సభ్యులు సర్వర్, మండల కోఆప్షన్ సభ్యులు షబ్బీర్ అన్నారు. ఈ మేరకు మండలంలోని కొంకపాక గ్రామంలో సోమవారం ఖమ్మం జిల్లాకు చెందిన మైనార్టీ దాతలు నిర్మాణాలకు శంకుస్థాపనలు చేయించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వ సహాయం లేకుండా నిర్మాణాల కోసం ముందుకు రావడం అభినందనీయమన్నారు.

గీతకార్మికుడికి గాయాలు

చెన్నారావుపేట : మండలంలోని లింగగిరి గ్రామానికి చెందిన ఇలసరపు ఐలయ్య వృత్తిరీత్యా తాటి చెట్టు ఎక్కడానికి సోమవారం సాయంత్రం గ్రామ శివారులోని వనానికి వెళ్లాడు. ప్రమాదవశాత్తు మోకు జారడంతో కింద పడ్డాడు. దీంతో ఐలయ్యకు తీవ్రగాయాలు అయ్యాయి. తోటి గీతకార్మికులు గమనించి చికిత్స నిమిత్తం నర్సంపేటలోని ఓ ఆస్పత్రికి తరలించారు.

చిరుధాన్యాలతోనే సంపూర్ణ ఆరోగ్యం



వర్ధన్నపేట: మాట్లాడుతున్న శ్రీదేవి



అన్నప్రాసన చేస్తున్న ఎంపీడీఓ భారతి

గీసుకొండ : మండలంలోని కొమ్మాలలో ఐసీడీఎస్ ఆధ్వర్యంలో సోమవారం పోషణ పక్షం నిర్వహించారు. సర్పంచ్ వీరాటి కవిత, అంగన్‌వాడీ టీచర్ భాగ్యక్క, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

పౌష్టికాహారం తీసుకోవాలి

చెన్నారావుపేట : ఆరోగ్యంగా ఉండాలంటే ప్రతి ఒక్కరూ పౌష్టికాహారం తీసుకోవాలని ఎంపీడీఓ భారతి అన్నారు. ఈ మేరకు మండల కేంద్రంలోని అంగన్‌వాడీ సెంటర్‌లో సోమవారం పోషణ పక్వాడ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా చిరుధాన్యాల వినియోగంపై ఆమె అవగాహన కల్పించారు. విజేతలకు తిరుమల అనిత బహుమతులు అందించారు.అనంతరం అన్నప్రాసన చేశారు. ఐసీడీఎస్ సూపర్‌వైజర్ మంజుల, రాధ టీచర్లు దేవమ్మ, లక్ష్మిబాయి, విజయ, అరుణాకుమారి, కృష్ణవేణి, ఇందిరా, పుష్ప, ఆశ వర్కర్లు ఉన్నారు.

వర్ధన్నపేట : చిన్నారులకు షెడ్యూల్ ప్రకారం నిర్ణీత సమయానికి టీకాలు వేయించాలని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ శ్రీదేవి అన్నారు. సోమవారం మండల కేంద్రంలో ఐసీడీఎస్ ఆధ్వర్యంలో పోషణ పక్షంలో భాగంగా వెల్‌బేబీ షో నిర్వహించారు. మున్సిపల్ చైర్‌పర్సన్ ఆంగోత్ అరుణ, కౌన్సిలర్లు, తల్లిదండ్రులు, అంగన్‌వాడీ టీచర్లు పాల్గొన్నారు.

వరంగల్ (పర్వతగిరి) : చిరుధాన్యాల తీసుకోవడం వల్ల సంపూర్ణ ఆరోగ్యం లభిస్తుందని సర్పంచ్ గటిక సుష్మ అన్నారు. ఈ మేరకు మండలంలోని చింతనెక్కొండలో పోషన్ పక్వాడ కార్యక్రమాన్ని సోమవారం నిర్వహించారు. ఐసీడీఎస్ సూపర్‌వైజర్ స్వరూప, అంగన్‌వాడీ సిబ్బంది పాల్గొన్నారు.

పోషకాహారం లోపిస్తే రక్తహీనత

సంగెం : పోషకాహారం లోపిస్తే రక్తహీనత ఇతర జబ్బులు వస్తాయని సీహెచ్‌ఓ చిన్నాబాయి అన్నారు. సోమవారం మండల కేంద్రంలోని శాంతి మండల సమాఖ్య కేంద్రంలో పోషణ పక్షంలో భాగంగా సంపూర్ణ పోషకాహారంపై అవగాహన సదస్సును, ప్రతిజ్ఞను నిర్వహించారు. కార్యక్రమంలో మండల సమాఖ్య అధ్యక్షురాలు కళ్యాణి, కార్యదర్శి రాజమణి, కోశాధికారి రేణుక, ఏపీఎం కిషన్, సీసీలు సురేష్, రాజయ్య, స్వరూపరాణి, కుమారస్వామి తదితరులు పాల్గొన్నారు.

కంటి వెలుగు శిబిరం ప్రారంభం



కంటి వెలుగు శిబిరంలో సర్పంచ్ సిద్దన రమేష్

గీసుకొండ : మండలంలోని ఎలుకుర్తిహవేలిలో కంటి వెలుగు శిబిరం సోమవారం ప్రారంభమైంది. ఎంపీపీ బీమగాని సౌజన్య, సర్పంచ్ పూంద్రు జయపాల్‌రెడ్డి, మండల రైతుబంధు కన్వీనర్ మాధవరెడ్డి, గీసుకొండ పీహెచ్‌సీ డాక్టర్ మాధవీలత, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ కళ్యాణి, జెడ్పీ ఉన్నత పాఠశాల హెచ్‌ఎం బాలకుమార్,పంచాయతీ కార్యదర్శి కళ్యాణి, అంగన్‌వాడీ టీచర్లు, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

కంటి వెలుగును సద్వినియోగం చేసుకోవాలి

చెన్నారావుపేట : గ్రామస్తులు కంటి వెలుగు కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని సర్పంచ్ సిద్దన రమేష్ అన్నారు. ఈ మేరకు మండలంలోని అమీనాబాద్‌లో సోమవారం కంటి వెలుగు శిబిరాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ బానోత్ పత్తినాయక్, ఎంపీటీసీ కడారి సునిత, సాయిలు, కంటి వెలుగు సూపర్‌వైజర్ కుండె శివాజీ, ఏఎన్‌ఎంలు, సిబ్బంది ఉన్నారు.

స్త్రీనిధిలో సీఏ చేతివాటం

సంఘాల డబ్బులు రూ.3.6లక్షలు స్వాహా..

నెక్కొండ : మండలంలోని చిన్నకొర్పోలు గ్రామైక్య సంఘం స్నేహ వీఓ సీఏ ఎలుక ప్రసన్న చేతివాటం ప్రదర్శించి సంఘం స్త్రీనిధి డబ్బులు రూ. 3.6లక్షలు స్వాహా చేసిన సంఘటన ఆలస్యంగా వెలుగు చూసింది. గ్రామంలో సోమవారం వీఓ అధ్యక్షురాలు కొయ్యడ యాకలక్ష్మి అధ్యక్షతన సంఘ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి స్త్రీనిధి రీజనల్ మేనేజర్ సైదిరెడ్డి హాజరయ్యారు. సైదిరెడ్డి తెలిపిన వివరాలు.. ప్రతి నెల సంఘాలు చెల్లిస్తున్న రుణాలను స్త్రీనిధి ఖాతాలో సీఏ జమ చేయకుండా వాడుకుంటోంది. దీంతో సంఘాలు చెల్లిస్తున్న డబ్బులు జమ కాకపోవడాన్ని తెలుసుకొని సీఏను 10నెలల క్రితం వారు నిలదీశారు. స్వాహా చేసిన డబ్బులను చెల్లిస్తానని సీఏ దాటవేస్తు వస్తోంది. దీంతో వారు అధికారుల దృష్టికి తీసుక వెళ్లగా రూ.75వేలు మాత్రమే రికవరీ చేశారు. ప్రతి నెల 3వ తేదీన జరిగే గ్రామైక్య సంఘం సమావేశంలో సీఏను నిలదీస్తున్నప్పటికీ ఫలితం లేదు. సీఏ కుటుంబానికి చెందిన రెండెకరాల లావణీ పట్టా భూమిని అమ్మి చెల్లిస్తానని చెప్పారు. దీంతో ఐదు నెలల నుంచి సీఏ డబ్బులు చెల్లిస్తేనే తాము చెల్లిస్తామని సంఘాలు మొండికేశాయి. దీని కారణంగా సీఏ, సంఘాలు కలిసి మొత్తం రూ.8.43 లక్షల రుణాలు స్త్రీనిధి ఖాతాలో జమకావల్సి ఉందని ఆయన పేర్కొన్నారు. భూమి పట్టాను యాకలక్ష్మి వద్ద ఉంచారు. రుణాలను సకాలంలో చెల్లించి, సంఘాల అభివృద్ధికి సహకరించాలని సూచించారు. ఈ సమావేశంలో సర్పంచ్ కర్ర వెంకట్‌రెడ్డి, శ్రీనిధి మేనేజర్ లావణ్య, ఏపీఎం శ్రీనివాస్, సీసీ వెంకట్, వీఓ ప్రతినిధులు, వివిధ సంఘాలు, తదితరులు పాల్గొన్నారు.

ఉపాధి పనులను వినియోగించుకోవాలి



పనులను ప్రారంభిస్తున్న సర్పంచ్ నర్సయ్య

రాయపర్తి : జాతీయ గ్రామీణ ఉపాధిహామీ పథకం పనులను కూలీలు సద్వినియోగం చేసుకొని ఆర్థికాభివృద్ధి సాధించాలని సర్పంచ్ గారె నర్సయ్య కోరారు. సోమవారం మండలకేంద్రం శివారులోని కేసీఆర్‌కాలనీ సమీపంలో ఉపాధిహామీ పనులలో భాగంగా పాంపాండ్ నిర్మాణ పనులను ఆయన ప్రారంభించారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి గుగులోత్ అశోక్‌నాయక్, కారోబార్ కారుపోతుల రామచంద్రయ్య, ఫీల్డ్ అసిస్టెంట్ ఐత ఉమ, కూలీలు పాల్గొన్నారు.

జిల్లా ఆస్పత్రికి అంబేడ్కర్ పేరు పెట్టాలి



సమావేశంలో మాట్లాడుతున్న వెంకటేశ్వర్లు

నర్సంపేట : నర్సంపేటలో నిర్మించే నూతన జిల్లా ఆస్పత్రికి అంబేడ్కర్ పేరును పెట్టాలని డాక్టర్ గద్ద వెంకటేశ్వర్లు డిమాండ్ చేశారు. ఈ మేరకు పట్టణంలోని అతిథిగృహంలో సోమవారం దళిత ప్రజా సంఘాల జేఏసీ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏప్రిల్ నెలలో మహానుభావుల జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించుకోవాలన్నారు. ఈ సమావేశంలో దళితరత్న ప్రణయ్‌దీప్, రిటైర్డ్ ఎంఈఓ లక్ష్మీనారాయణ, పలు సంఘాల బాధ్యులు డేవిడ్, వీరప్రకాశ్, శోభన్, కేదారి, సారయ్య, సదానందం, శ్రీనివాస్, రవి, సురేష్, వినయ్, స్వామి, తదితరులు పాల్గొన్నారు.

అవయవ దానానికి ముందుకు రావాలి



సర్టిఫికెట్లు అందజేస్తున్న అసోసియేషన్ బాధ్యులు

ఖానాపురం : సమాజంలోని ప్రతీ ఒక్కరు అవయవ దానం చేయడానికి ముందుకు రావాలని తెలంగాణ నేత్ర, అవయవ, శరీర దాతల అసోసియేషన్ అధ్యక్షుడు కొండ్రెడ్డి మల్లారెడ్డి అన్నారు. ఈ మేరకు మండలంలోని అశోక్‌నగర్ గ్రామానికి చెందిన గోలి సువర్ణ మార్చి 24న మృతి చెందడంతో మృతదేహాన్ని కాకతీయ మెడికల్ కళాశాలకు అప్పగించారు. దీంతో సోమవారం సంస్మరణ సభ ఏర్పాటు చేసి కుటుంబ సభ్యులను సత్కరించి అవయవదాన సర్టిఫికెట్లను అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ మృతిచెందిన ఎనిమిది గంటల లోపు నేత్రదానం చేస్తే ఇద్దరు అంధులకు చూపునిచ్చిన వారు అవుతారన్నారు. వైద్యశాస్త్ర పరిశోధనకు సైతం ఉపయోగపడతాయన్నారు. అవయవ దానం చేయాలనుకునే వారు 87905 48706, 97037 38699లలో సంప్రదించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ బాధ్యులు ఉపేందర్ రెడ్డి, శంకర్‌రావు, రాజమౌళి, కేదారి, గ్రామస్తులు ఉపేందర్‌రెడ్డి, అమరేందర్‌రెడ్డి, తిరుపతిరెడ్డి, వెంకట్‌రెడ్డి, ఈశ్వరమూర్తి, తదితరులు పాల్గొన్నారు.

కొమురయ్య జీవితం స్ఫూర్తిదాయకం



వర్ధన్నపేట: మాట్లాడుతున్న శ్రీధర్‌రెడ్డి



చెన్నారావుపేట: నివాళులర్పిస్తున్న సర్పంచ్



సంగెంలో..

వర్ధన్నపేట : దొడ్డి కొమురయ్య జీవితం భావితరాలకు స్ఫూర్తిదాయకమని వర్ధన్నపేట డిగ్రీ కళాశాల చరిత్ర విభాగం అధిపతి శ్రీధర్‌రెడ్డి అన్నారు. సోమవారం మండల కేంద్రంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో దొడ్డి కొమురయ్య జయంతి వేడుకలను కళాశాల చరిత్ర విభాగం ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ సీహెచ్ శ్రీనివాస్‌రావు అధ్యక్షతన జరిగిన సమావేశంలో శ్రీధర్‌రెడ్డి మాట్లాడుతూ తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటంలో తొలి అమరుడు దొడ్డి కొమురయ్య అని చెబుతూ ఆయన జీవిత్ర చరిత్రను వివరించారు. వైస్ ప్రిన్సిపాల్ సమత, అధ్యాపకులు, తదితరులు పాల్గొన్నారు.

దొడ్డి కొమురయ్య జయంతి

చెన్నారావుపేట : తెలంగాణ రైతు సాయుధ పోరాట యోధుడు దొడ్డి కొమురయ్య జయంతి వేడుకలను గ్రామ పంచాయతీ ఆవరణలో సోమవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సర్పంచ్ కుండె మల్లయ్య కొమురయ్య చిత్ర పటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో కార్యదర్శి రాజేందర్, మరాఠీ నర్సయ్య, సిబ్బంది ఉన్నారు.

సంగెంలో..

సంగెం : మండల కేంద్రంలో తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటంలో తొలి అమరుడు దొడ్డి కొమురయ్య జయంతిని సీపీఎం ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో కార్యదర్శి దుపాకి రాజు, నాయకులు మెట్టుపల్లి ఏలియా, మెట్టుపల్లి బాబు, చేరాలు, గుండేటి మొగిళి, కుమారస్వామి పాల్గొన్నారు.

బీజేపీ కార్యాలయం ఎదుట ధర్నా



గీసుకొండ : గ్రేటర్ వరంగల్ నగరం 16వ డివిజన్ ధర్మారం బీజేపీ జిల్లా నూతన కార్యాలయం వద్ద ఎంఎస్పీ, ఎమ్మార్పీస్ నాయకులు సోమవారం ధర్నా చేపట్టారు. ఎస్సీ వర్గీకరణపై కేంద్ర ప్రభుత్వ నిర్లక్ష్యానికి వ్యతిరేకంగా రాష్ట్ర వ్యాప్తంగా చేపట్టిన బీజేపీ కార్యాలయాల ముట్టడిలో భాగంగా ధర్నాను నిర్వహించారు. మహాజన సోషలిస్టు పార్టీ(ఎంఎస్పీ) జిల్లా ఇన్‌చార్జ్ బిర్రు మహేందర్, నాయకులు కదికట్ల విజయ్, ఎమ్మార్పీఎస్ జిల్లా కన్వీనర్ కల్లెపెల్లి ప్రణయ్‌దీప్, ఈర్ల కుమార్, తడుగుల విజయ్, జన్ను మధుకర్, ఇనుముల పూర్ణయ్య, అందె రవి పాల్గొన్నారు.